# అతనొక హిప్నాటిక్ నీడ

నేనందించిన మాటల్ని ఎంతో నమ్మకంతో
గుండెలో వేసుకుని వెళ్ళిపోతాడు
ఒకరికొకరం కొన్ని నిముషాల జీవితాన్ని
వడబోసి పంచుకున్న తరువాత
రోజు రోజుకీ ఇరుకవుతూన్న సహచర్యాలూ
సంఘర్షణాగ్నిలో మండే ప్రాథమిక సంబంధాలూ
మృత్యుబిలం లాంటి నమ్మకాలూ
రేఖామాత్రంగా స్పర్శించిన తరువాత
ఇద్దరమూ రెండు పెంపకాలకీ
రెండు రహస్యాలకీ
సాంకేతిక చిహ్నాల నీడలమే అయినా
అతను నిలబడ్డ స్థలంలో...
మనిషితనం చెమ్మగిల్లిన
చెలమ బుగ్గ పారుతుంది
అప్పుడప్పుడు ఈ గుండె డైనమైట్లను మోస్తున్న
లెదర్ బ్యాగ్‌లా ఉందంటాడు
పాకురు పట్టిన ఊహల్నీ, చేష్టల్నీ
జిల్లేడు పూల జిగురుతో కడిగేయాలంటాడు
మా ఊర్లోని,
ఢిల్లం – భల్లం లయ
బతుకమ్మ పాట, ఇరానీ హోటల్ చాయ్
పీర్ల ఊరేగింపులోని నిప్పుల్ని తొక్కే పాదాల

తెగింపూ తన కిష్టం అంటాడు
స్విచ్ వేసినపుడు బల్బు నవ్వినట్టుగా ఉంటుంది
అతని చూపు
సైరన్ మోత వినబడగానే సైకిలెక్కి వెళ్ళిపోతాడు
రెండు అస్పష్ట ఛాయా చిత్రాలు
అతని కనుబొమ్మల మీద
నల్లటి నెత్తుటి ఖండాలయి వేలాడుతూనే ఉంటాయి.
లోలోపలి మార్మిక దుఃఖావస్థలని
ఎలా కడిగేయాలని నిలదీస్తూంటాడు
నా వెన్నుపై ధైర్యాన్ని గునపంలా గుచ్చి ——
హఠాత్తుగా చనిపోయిన మా నాయన
గుర్తుకొస్తాడతన్ని చూసినపుడు
సర్కస్ బావిలోని మోటార్ సైకిలిస్ట్ ఫీట్స్ లాగా
అడుగుల్లోకి, అడుగుల్లేని లోపల్లోకి, వలయాంతస్థలాల్లోకి
నెట్టేసింది అతనే నన్ను.
చనిపోయిన అజ్ఞాత వ్యక్తి కఫన్‌ని కూడా గ్రంథాలయం
చేయమంది అతనే నన్ను.
ఆకాశంలో పక్షుల ప్రవాహాల కోసం
వెదికే కంటి చూపు సౌందర్యం
నాలోకి ప్రస్తారం చేసిందీ అతనే
ప్రతి రాపిడినీ... గాయాల చెమ్మనీ...
ఆయస్కాంత దీపంగా
గుండె మీదికి కప్పుకోమన్నది అతని స్నేహమే.
నిజం...

ఇప్పటికీ అతనొక హిప్నాటిక్ నీడలా

నన్ను అనునయిస్తూ

అనుభవాన్నిస్తూ

అతనే...

అతనే...

సిద్ధార్థ

('దీపశిల' – 1994)